RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 73 Vol: 73 | ఏప్రిల్ 02 గురువారం 2026 April 02 Thursday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

రెండు పంచాయతీల కు అవార్డులు

2

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

29 మంది మృతి



న్యూఢిల్లీ జనసంఘర్షణ
రష్యాలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. క్రిమియా ద్వీపకల్పం మీదుగా ప్రయాణిస్తున్న రష్యాకు చెందిన ఆంటోనోవ్-26 రకానికి చెందిన సైనిక విమానం మంగళవారం సాయంత్రం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 23 మంది సైనికులు మరియు ఆరుగురు సిబ్బంది కలిపి మొత్తం 29 మంది దుర్మరణం

మిగతా 2వ పేజిలో..

## తెలంగాణలో భూ వివాదాలకు చెక్

నేటి నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా 'భూభారతి' అమలు



హైదరాబాద్ జనసంఘర్షణ
తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిష్టాత్మకమైన 'భూభారతి' సేవలను ఏప్రిల్ 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ప్రారంభించనుంది. దీనిపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశలో ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, మరియు నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ఈ పోర్టల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కొత్త విధానం

మిగతా 2వ పేజిలో..

## ఐటీ రంగంలో ఒరాకిల్ భారీ కోత

- 30 వేల మంది ఉద్యోగుల తొలగింపు,
- 12 వేల మంది భారతీయులపై వేటు




న్యూఢిల్లీ జనసంఘర్షణ
ప్రపంచవ్యాప్త ఐటీ ఉద్యోగులకు అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ కోలుకోలేని షాక్ ఇచ్చింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏకంగా 30,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది సంస్థ మొత్తం సిబ్బందిలో సుమారు 18 శాతానికి సమానం. ఈ భారీ లేఆఫ్స్ ప్రభావం భారతీయులపై తీవ్రంగా పడింది; బాధితుల్లో

మిగతా 2వ పేజిలో..

## సోషల్ మీడియా పోస్టులపై కేంద్రం నిఘా

- కొత్త నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



న్యూఢిల్లీ జనసంఘర్షణ
సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదా అభ్యంతరకరంగా పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఐటీ నిబంధనలకు సవరణలు చేస్తూ కొత్త

మిగతా 2వ పేజిలో..

## నగరంలో హనుమాన్ శోభాయాత్రకు సర్వం సిద్ధం

3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు



హైదరాబాద్ జనసంఘర్షణ
హైదరాబాద్ నగరం హనుమత్ జయంతి వేడుకలకు ముస్తాబైంది. ఏటా ఆనవాయితీగా వచ్చే మహా శోభాయాత్ర ఏప్రిల్ 2వ తేదీన అత్యంత వైభవంగా జరగనుంది. ఈ యాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నగర పోలీస్ కమిషనర్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించి భద్రతా పరమైన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గౌలిగూడ రామమందిరం నుండి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర సాగే ఈ ప్రధాన యాత్రలో దాదాపు 168 ఉప శోభాయాత్రలు కలవనున్నాయని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 3 వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన

మిగతా 2వ పేజిలో..

## ఈ వేసవిలో నిప్పుల కొలిమిగా మారనున్న రాష్ట్రం

మూడు నెలల పాటు వడగాడ్పుల హెచ్చరిక




హైదరాబాద్ జనసంఘర్షణ
భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం, ఈ ఏడాది వేసవి సీజన్ పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయని తేలింది. ఏప్రిల్ నుండి జూన్ వరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తరప్రదేశ్ మరియు ఈశాన్య రాష్ట్రాల్లో ఎండలు మంట పుట్టించనున్నాయి. ముఖ్యంగా రానున్న మూడు నెలల కాలం దేశంలోని అనేక ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ సీజన్‌లో వడగాడ్పుల తీవ్రత కూడా అధికంగా ఉండనుంది. ఏప్రిల్‌లో సగటున మూడు నుండి నాలుగు రోజులు వడగాడ్పులు వీస్తుండగా, మే మరియు జూన్ నెలల్లో పది రోజులకు పైగా ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరుకోనున్నాయి. కేవలం పగటి పూటే కాకుండా, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండి ఉక్కపోత పెరిగే

మిగతా 2వ పేజిలో..

## దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు

రెండు నెలలకు సరిపడా ముడి చమురు సిద్ధం

న్యూఢిల్లీ జనసంఘర్షణ
అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశంలో ఇంధన కొరత లేదని కేంద్ర పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలో రాబోయే రెండు నెలల అవసరాలకు సరిపడా ముడి చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. దేశంలోని రిఫైనరీలన్నీ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్లలో పెట్రోల్, డీజిల్ లభ్యతపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుండి 100 డాలర్లకు పైగా చేరినప్పటికీ, దేశీయ వినియోగదారులపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆమె వివరించారు. 2024 మార్చిలో లీటరుకు రూ. 2 చొప్పున తగ్గించిన ధరలే ప్రస్తుతం అమలులో ఉన్నాయని గుర్తు చేశారు. అంతర్జాతీయ ధరల అస్థిరత నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిందని, అలాగే దేశీయంగా ఏటీఎఫ్, డీజిల్ కొరత రాకుండా ఎగుమతులపై సుంకం విధించినట్లు తెలిపారు. ఇంధనం కోసం ప్రజలు పానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. గృహ అవసరాలకు సంబంధించిన ఎల్పీజీ సరఫరాపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు 522 డాలర్ల నుండి 780 డాలర్లకు పెరిగినప్పటికీ, డొమెస్టిక్ సిలిండర్ల ధరలను పెంచలేదని సుజాత శర్మ స్పష్టం చేశారు. ధరల పెరుగుదల వల్ల ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (రావీజం) కలిగే నష్టాన్ని

మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
02 గురువారం, ఏప్రిల్ 2026

## తెలంగాణలో భూ వివాదాలకు చెక్

**మొదటిపేజీ తరువాయి..** ద్వారా ప్రతి భూ సర్వే నంబర్‌కు ఆధార్ కార్డు తరహాలోనే ఒక ప్రత్యేకమైన 'భూధార్' నంబర్‌ను కేటాయించనున్నారు. గతంలోని ధరణి పోర్టల్‌లో ఉన్న 36 రకాల మాడ్యూల్స్ వల్ల కలిగే గందరగోళానికి స్వస్తి పలుకుతూ, భూభారతిలో అన్ని అంశాలను ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చారు. రైతులు తమ ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి, ఒక్క క్లిక్‌తో తమ భూమికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. ఎన్నికల హామీలో భాగంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జత చేయడం ఇకపై తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే మ్యాపులు లేని ఐదు గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూధార్ ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా భూభారతిని అమలు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది.

## నగరంలో హనుమాన్ శోభాయాత్రకు సర్వం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి..** బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. యాత్ర సజావుగా సాగేందుకు వీలుగా వలంటీర్లకు తగిన శిక్షణ ఇవ్వాలని, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో సిద్ధం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఫ్లైఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా వాహనాల మళ్లింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంటుందని, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే యాత్ర మార్గంలో రోడ్లపై ఉన్న అడ్డంకులు, చెత్తాచెదారం మరియు విద్యుత్ తీగలకు తగిలే చెట్టు కొమ్మలను తొలగించే పనులు పూర్తయ్యాయి. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ శాంతియుత వాతావరణంలో జయంతి వేడుకలను జరుపుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

**మొదటిపేజీ తరువాయి..** చెందినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటల సమయంలో రాడార్‌తో సంబంధాలు తెగిపోయిన కొద్దిసేపటికే, ఈ విమానం ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. విమానంపై ఎటువంటి దాడులు జరిగినట్లు ఆధారాలు లేవని, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 1960వ దశకం చివరలో ప్రవేశపెట్టిన ఈ ఆంటోనోవ్-26 విమానాలను ప్రధానంగా సైనిక అవసరాలు మరియు సరుకు రవాణా కోసం ఉపయోగిస్తుంటారు. అయితే, ఈ మోడల్ విమానాలు గత కొన్నేళ్లుగా వరుస ప్రమాదాలకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో 2020లో జరిగిన శిక్షణ విమానం ప్రమాదంలో 20 మంది, 2022లో ఉక్రెయిన్‌లో జరిగిన ఘటనలో ఒకరు, అలాగే ఈ ఏడాది దక్షిణ సూడాన్‌లో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తాజా ఘటనతో రష్యా రక్షణ రంగంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## సోషల్ మీడియా పోస్టులపై కేంద్రం నిఘా

**మొదటిపేజీ తరువాయి..** ముసాయిదాను కేంద్రం విడుదల చేసింది. దీని ప్రకారం, ఇకపై ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి వేదికలపై వివాదాస్పద పోస్టులు చేసే వారికే కాకుండా, వాటిని షేర్ చేసే వారికి కూడా నేరుగా నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కొత్త ప్రతిపాదనల ప్రకారం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లను కూడా 'న్యూస్ పబ్లిషర్లు'గానే పరిగణించాలని కేంద్రం భావిస్తోంది. సమాచార మరియు బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ ద్వారా ఈ నిఘా కొనసాగనుంది. ఏదైనా పోస్ట్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే, నేరుగా సదరు యూజర్‌కే నోటీసులు పంపేలా 2021 ఐటీ నిబంధనలకు సవరణలు చేయనున్నారు. ఈ ముసాయిదా నిబంధనలపై ప్రజలు మరియు నిపుణులు తమ అభిప్రాయాలను ఏప్రిల్ 14వ తేదీలోగా తెలియజేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఒకవేళ ఈ ప్రతిపాదనలు చట్టరూపం దాల్చితే, ఆన్‌లైన్ వేదికలపై అభిప్రాయాలను పంచుకునే సమయంలో వినియోగదారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా సోషల్ మీడియా ఖాతాలను బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

## దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు

**మొదటిపేజీ తరువాయి..** పూడ్చేందుకు ప్రభుత్వం భారీగా ఆర్థిక సాయం అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను సుమారు రూ. 30,000 కోట్ల కేటాయింపులకు ఆమోదం తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. గ్యాస్ కనెక్షన్ల విస్తరణలో భాగంగా మార్చి నెలలో లక్షలాది కొత్త కనెక్షన్లు ఇచ్చామని, ఎక్కడా స్టాక్ లేదనే ఫిర్యాదులు అందలేదని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఈ వేసవిలో నిప్పుల కొలిమిగా మారనున్న రాష్ట్రం

**మొదటిపేజీ తరువాయి..** అవకాశం ఉంది. దేశంలోని దాదాపు 95 శాతం ప్రాంతాల్లో రాత్రిపూట వేడి వాతావరణం కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పులకు సంబంధించి అంతర్జాతీయ మోడల్స్ విశ్లేషణ ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో 'లానినా' ప్రభావం ముగింపు దశకు చేరుకుంది. ఏప్రిల్ నుండి జూన్ వరకు వాతావరణం తటస్థంగా ఉండి, జూన్ నెలలో నైరుతి రుతుపవనాల ప్రారంభంతో 'ఎల్ నినో' పరిస్థితులు మొదలయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్ నెలలో ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. మార్చి నెలలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. గోదావరి జిల్లాలు మినహా తెలుగు రాష్ట్రాల్లోని మిగిలిన అన్ని ప్రాంతాల్లో ఈ వేసవిలో ఎండలు మరియు వడగాడ్పుల ప్రభావం తీవ్రంగా ఉండనుంది.

## ఐటీ రంగంలో ఒరాకిల్ భారీ కోత

**మొదటిపేజీ తరువాయి..** సుమారు 12,000 మంది మన దేశానికి చెందిన వారే కావడం గమనార్హం. మంగళవారం ఉదయం ఒక్కసారిగా వేలాది మందికి లేఆఫ్ మెయిల్స్ పంపడమే కాకుండా, తక్షణమే సిస్టమ్ యాక్సెస్‌ను నిలిపివేయడంతో ఉద్యోగులు దిగ్భ్రాంతికి గురయ్యారు. విచిత్రమేమిటంటే, ఒరాకిల్ ప్రస్తుతం ఆర్థిక నష్టాల్లో లేదు. గత త్రైమాసికంలో కంపెనీ లాభాలు 95 శాతం వృద్ధి చెంది 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏఐ డేటా సెంటర్ల రంగంలో సుమారు 156 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టాలని సంస్థ నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఖర్చులను తగ్గించుకుని, దాదాపు 10 బిలియన్ డాలర్ల నగదును ఆదా చేసేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న వారు ఈ కోతలకు ఎక్కువగా గురయ్యారు. తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొంత ఉపశమన ప్యాకేజీని ప్రకటించింది. ఇందులో భాగంగా మూడు నెలల అదనపు జీతం, సర్వీసులో ఉన్న ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులకు నగదు చెల్లింపు మరియు గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలను అందించనుంది. అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ సూచించిన గడువులోగా రాజీనామా చేసిన వారికి మాత్రమే వర్తిస్తాయని యాజమాన్యం స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఇది ఒక విడత మాత్రమేనని, మున్ముందు మరిన్ని తొలగింపులు ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఐటీ వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

## రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

**హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క**

**న్యూఢిల్లీ,ఏప్రిల్1 :** గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి: రామ్

**హైదరాబాద్, ఏప్రిల్1 :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## మంగళ్‌హాట్ గోదాముపై దాడి

**హోటళ్లకు చచ్చిన మేకల మాంసం**

**కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం**

**హైదరాబాద్,ఏప్రిల్1 :** హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

**నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపిలు**

**తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్1 :** ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమాకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్ధిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. మోడీ అందిస్తున్న చేయత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించు కోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలనన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల మీద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబులిటీ స్టడీ చేసేందుకు రూ.40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

**తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, ఏప్రిల్1 :** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

# ‘రైతుకే రక్షణ... గిట్టుబాటు ధరకు హామీ!’

❑ **ఇల్లందులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం**



భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి:( జన సంఘర్షణ )
ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య బుధవారం రేపల్లెవాడ, కొమరారం, ఇల్లందు మార్కెట్ యార్డులలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఘనంగా ప్రారంభించారు. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. క్వింటాకు రూ. 2400 చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్యకి రైతులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగానికి ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారని అన్నారు. రైతులు నెలల తరబడి కష్టపడి పండించిన పంటను దళారుల వల్ల నష్టపోకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే ఈ నిర్ణయం గొప్ప ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈసారి రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను కూడా ప్రభుత్వం అందించనున్నట్లు వెల్లడించారు. పంటలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నా రైతులు అధికారులను సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బానోతు రాంబాబు నాయక్, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# “మానవత్వానికి చిరునామా... బయ్యారం ప్రజావేదిక!”

❑ **బీద కూలీ కుటుంబానికి అండగా నిలిచిన మండల ప్రజలు**

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ)
బయ్యారం మండలంలో మరోసారి మానవత్వం పరిమళించింది. బయ్యారం మండల ప్రజావేదిక వాట్సప్ గ్రూప్ ద్వారా గంధంపల్లి గ్రామానికి చెందిన హమాలీ కూలీ, భాజపా కార్యకర్త దేరాంగుల రాంబాబు కుటుంబానికి సహాయహస్తం అందించారు. వారం రోజుల వ్యవధిలోనే 24 గంటల తేడాతో తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన రాంబాబు తీవ్ర విషాదంలో మునిగిపోయాడు. రోజూ హమాలీ పని చేస్తే గానీ జీవనం సాగని పరిస్థితుల్లో, ఈ అనూహ్య దుఃఖంతో కుటుంబం పూర్తిగా కుంగిపోయింది. ఈ విషయాన్ని ఒక సభ్యుడు ప్రజావేదిక వాట్సప్ గ్రూప్‌లో తెలియజేయడంతో స్పందించిన కమ్యూనిటీ సభ్యులు వెంటనే సహాయం చేయాలని నిర్ణయించారు. సభ్యుల సహకారంతో 100 కిలోల బియ్యం, 2 కిలోల కందిపప్పు, 2 లీటర్ల వంట నూనె సేకరించి, వాటిని ఆటో ద్వారా గంధంపల్లి గ్రామానికి తరలించారు. ఈ సహాయం రాంబాబు కుటుంబానికి ఆపన్నహస్తంగా మారింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, “ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒకరికొకరు అండగా నిలవడం మన బాధ్యత” అని పేర్కొన్నారు. సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారికి ఎల్లప్పుడూ మంచి జరగాలని దేవుడిని కోరుకుంటున్నామని తెలిపారు. సహాయం పంపిణీ పూర్తైన అనంతరం, సంబంధిత ఫోటోలు, సేకరించిన సహాయ వివరాలను కమ్యూనిటీ గ్రూప్‌లో వెల్లడించనున్నట్లు తెలిపారు.




# అధికారుల నిర్లక్ష్యానికి బలి

❑ **ఇల్లందులో విద్యుత్ ఘాతంతో యువకుడి మృతి**

ఇల్లందు ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)
అధికారుల నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఇల్లందు పట్టణంలో కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణ పనుల్లో భాగంగా చోటుచేసుకున్న ప్రమాదంలో కుంజ ఉదయ్ కుమార్ (30) విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు.

**సంఘటన వివరాలు:**

**అధికారుల నిర్లక్ష్యం:** ప్రైవేట్ వ్యక్తులతో పనులు చేయిస్తూ, కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం.

**సమన్వయ లోపం:** విద్యుత్ సరఫరా నిలిపివేయకుండానే (ఎల్‌సీ తీసుకోకుండా), ఫోర్ మెన్, ఏఈల ఆదేశంతో ఉదయ్ స్తంభంపైకి ఎక్కాడు. లైన్ ఛార్జ్ కావడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

**డిమాండ్:** అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే ఈ మరణం సంభవించిందని మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -1( జన సంఘర్షణ)
ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జ్ రాణి అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ బుధవారంతో 5వ రోజుకు చేరుకుంది. దీంతో గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.రక్త మార్పిడి, రక్షణ లేని శారీరక సంబంధాలు, ఇంజెక్షన్ సూదుల పునర్వినియోగం వంటి మార్గాల ద్వారా ఎయిడ్స్ వ్యాధి కలుగుతుందన్నారు. చేతులు కలపడం, ఒకే పాత్రలో భోజనం చేయడం, దగ్గరగా కూర్చోవడం వంటి వాటితో హెచ్ ఐ వి సంక్రమణ జరగదని విద్యార్థులకు అవగాహన కల్పించారు.సురక్షిత జీవనశైలి, శుభ్రమైన వైద్య పరికరాల వినియోగం, రక్తదానం సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపించవదని సూచించారు. ఎయిడ్స్ బాధితులపై వివక్ష నివారణకు విద్యార్థులు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపడం పెద్ద నేరమని, అవగాహన పెంచడం, బాధితులకు మద్దతుగా నిలవడం మన సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇంచార్జ్ రాణి, అధ్యాపకులు చంద్రకాంత్ వాలంటీర్లు పాల్గొన్నారు.






# ఉపాధి హామీ పనుల ప్రారంభోత్సవం


కారేపల్లి: ఏప్రిల్ 01 జన సంఘర్షణ



ఉపాధి హామీ పనుల ప్రారంభోచవంలో సర్పంచ్ నూతన ఆర్థిక సంవత్సరం 2026-27 గాను ఉపాధి హామీ పనులు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించిన అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ .ఈ సంబర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... వేసవి కాలం దృష్ట్యా పనికి త్వరగా రావలసినదిగా, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పని ప్రదేశంలో 4 గంటలు పని చేయాలి అని, రోజుకు కూలీ 307 పడే విధంగా కొలతల ప్రకారం పని చేయాలి అని, పని ప్రదేశం లో ఉండవలసిన టెంట్, మంచి నీళ్ళు, ప్రథమ చికిత్స కిట్ మొదలగునవి ఏర్పాటు చేస్తాము అని చేపటం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు వార్డ్ సభ్యులు వాంకుడోత్ రమేష్, మేట్ అజ్మీరా సురేష్,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

బీబీపేట్,ఏప్రిల్ 1 ( జన సంఘర్షణ )




కామారెడ్డి జిల్లా, బీబీపేట్‌లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జరుపుకోవాలని బిక్కనూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో జరిగే హనుమాన్ ఊరేగింపు సందర్భంగా బీబీపేట దోమకొండ బిక్కనూర్ రాజంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు . ప్రతి ఒకరు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

# మాల్యాపూర్‌లో పశువులకు గాలికుంటు టీకాలు

బిబిపేట్,ఏప్రిల్ 1. ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా,బీబీపేట మండలం మల్యాపూర్ లోపాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆరు నెలలకు ఒకసారి ఈ టీకాలు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ నాగరాజు, మండల పశువైద్య అధికారి హేమశ్రీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అశ్వరావుపేట కార్ డ్రైవర్స్ నూతన కమిటీ ఎన్నిక


❑ **నూతన కమిటీ ఎన్నికైన వారికి అభినందనలు తెలియజేసిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ అబ్బాస్**



1-4-2026 జన సంఘర్షణ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కార్ డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీగా ఏర్పడి చేయడం జరిగింది ప్రెసిడెంట్ గండ్రాలనాగేశ్వరావు వైస్ ప్రెసిడెంట్ ఉప్పాడ హరి బ్రహ్మానందం క్యాషీర్ తోట్కో వెంకటేశ్వరరావు సెక్రెటరీ గుమ్మడి నాగరాజు ఎన్నికయ్యారు వీరు మాట్లాడుతూ మన డ్రైవర్లు కి ఎన్నో సమస్యలు ఉన్నాయి ముందుగాకార్ స్టాండ్ లేదు అలాగే ఒక ఆఫీసు కూడా లేదు డ్రైవర్లు జీతాలపైఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి వీటిని పరి గ్రామాన్నితీసుకుని ముందుగా ఒక ఆఫీసు ఏర్పాటు చేసుకుందాం అలాగే కార్ స్టాండ్ కూడా తీసుకొచ్చేలా కృషి చేస్తామని వాళ్ళు తెలిపారు.

# దివ్యాంగులకు గుడ్ న్యూస్.. సదరం క్యాంపులు షురూ!

ఇల్లందు ఏప్రిల్ 01(జన సంఘర్షణ)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అప్‌డేట్: భద్రాద్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఈ నెల 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం క్యాంపులను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ వెల్లడించారు. ఈ క్యాంపులు ఏప్రిల్ 7, 8, 10, 15, 17, 21, 24, 28 తేదీలలో అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే 16 కేటగిరీలలో స్లాట్ బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తామని, కావున అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. స్లాట్ ఉన్నవారు నిర్ణీత తేదీల్లో సదరం క్యాంపుకు హాజరై తమ సర్టిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సిందిగా కోరడమైనది.



Accordingly, UDID Slot Bookings during April'2026 to conduct medical camps for the categories permitted by the Government detailed as below.

| S. No | Disability Category | No.of PwDs Proposed for Assessment | | | Date of the UDID Camps |
|---|---|---|---|---|---|
| 1 | Locomotor Disability | 35 | 5 | 75 | 07.04.2026 Tuesday |
| | Intellectual Disability | 3 | 1 | | |
| | Mental Illness | 10 | 2 | | |
| | Acid Attack Victim | 6 | | | |
| | Autism Spectrum Disorder | 4 | | | |
| | Cerebral Palsy | 2 | | | |
| | Chronic Neurological Conditions | 7 | | | |
| 2 | Hearing Impairment | 40 | 10 | 84 | 08.04.2026 Wednesday |
| | Speech and Language Disability | 10 | | | |
| | Blindness | 4 | 5 | | |
| | Low vision | 15 | | | |
| 3 | Locomotor Disability | 35 | 5 | 80 | 10.04.2026 Friday |
| | Intellectual Disability | 3 | 1 | | |
| | Mental Illness | 10 | 2 | | |
| | Dwarfism | 3 | | | |
| | Hemophilia | 3 | | | |
| | Leprosy Cured | 3 | | | |
| | Multiple Sclerosis | 5 | | | |
| | Sickle Cell | 10 | | | |
| 4 | Hearing Impairment | 40 | 10 | 85 | 15.04.2026 Wednesday |
| | Speech and Language Disability | 10 | | | |
| | Blindness | 5 | 5 | | |
| | Low vision | 15 | | | |
| 5 | Locomotor Disability | 35 | 5 | 76 | 17.04.2026 |
| | Intellectual Disability | 3 | 1 | | |
| | Mental Illness | 10 | 2 | | |
| | Multiple Disabilities | 5 | | | |

# ‘లేబర్ ఇన్సూరెన్స్’ పేరిట ఎలాంటి పథకం అమలులో లేదు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)




దేశవ్యాప్తంగా ‘లేబర్ ఇన్సూరెన్స్’ పేరిట ఎలాంటి ప్రత్యేక పథకం అమలులో లేదని డిప్యూటీ కమిషనర్ విజయ భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలో కార్మికుల నమోదు ప్రక్రియపై ఆయన సమీక్షిస్తూ, ఖమ్మం జిల్లాలో మొత్తం 2.5 లక్షల మంది కార్మికులు నమోదు చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం కేవలం 1.20 లక్షల మంది మాత్రమే క్రియాశీలకంగా ఉన్నారని వెల్లడించారు. అయితే, ప్రస్తుతమున్న ఈ యాక్టివ్ కార్మికుల్లో కూడా దాదాపు సగం మంది అనర్హులే ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఆయన పేర్కొన్నారు. కేవలం అర్హులైన వారికే ప్రభుత్వ ఫలాలు అందాలనే ఉద్దేశంతో ఈ వివరాలను వెల్లడిస్తున్నట్లు ఆయన వివరించారు.

జన సంఘర్షణ
గురువారం
02 ఏప్రిల్2026

# పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం శిక్ష ఖరారు


- చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది.
- హైదరాబాద్ సిటీ పోలీస్

హైదరాబాద్ సిటీబ్యూరో /ఏప్రిల్ 1( జనసంఘర్షణ )
కేసు వివరాలు: హైదరాబాద్‌లోని హాకా భవన్ (హాక భవన్ ) వద్ద గల పోక్సో కేసుల ప్రత్యేక సెషన్స్ జడ్జి జి. ఉదయ భాస్కర్ రావు, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 194/2019, యూ /ఎస్ 354, 354-ఏ, 509 ఐ పి సి, సెక్షన్ 11 ఆర్ /డబ్ల్యు 12 చట్టం కింద నమోదైన కేసులో నిందితుడు చువ్వా వీరేష్ (52 సం॥లు), తండ్రి: అంజయ్య, నివాసం: సూర్య నగర్, చిక్కడపల్లికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి 01 సంవత్సరం 03 నెలల 23 రోజుల కఠిన కారాగార శిక్షతో పాటు 1500 రూపాయల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.
సంఘటన నేపథ్యం: 10.06.2019 రాత్రి 8:30 గంటల సమయంలో, బాధితురాలు (11 ఏళ్ల బాలిక) తన తల్లి సూచన మేరకు మైదా పిండి కోసం సమీపంలోని వీరేష్ కిరాణా షాపుకు వెళ్లింది. తిరిగి వస్తున్న క్రమంలో నిందితుడు వీరేష్ బాలికను అడ్డగించి, ఆమె చేయి పట్టుకుని బలవంతంగా తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. లోపలి నుండి గడియ పెట్టి, బాలిక టీ-షర్ట్ లాగి అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, ముద్దు ఇవ్వాలని కోరాడు. బాలిక తెచ్చిన మైదా పిండిని తన ఇంట్లోనే ఉంచుకుని, "ఇప్పుడు ఇంటికి వెళ్లి మళ్ళీ రా, నీ కోసం వేచి ఉంటాను" అని చెప్పాడు. ఆ సమయంలో బాలిక అతికష్టం మీద గడియ తీసి, భయంతో ఇంటికి పరుగులు తీసి జరిగిన విషయాన్ని తల్లికి వివరించింది. దీంతో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డింగ్ కోసం కేసును 'భరోసా' కేంద్రానికి బదిలీ చేశారు.
పోలీస్, భరోసా టీమ్ కృషి: బాధితురాలికి, ఆమె కుటుంబానికి భరోసా బృందం వివిధ కౌన్సెలింగ్ పద్ధతుల ద్వారా అండగా నిలిచింది. నిరంతర ఫాలో-అప్ సెషన్లు, వర్క్‌షాప్‌ల ద్వారా వారికి నైతిక, మానసిక మద్దతును అందించారు. ఈ శిక్షా పడటం పట్ల బాధితురాలి కుటుంబం హర్షం వ్యక్తం చేసింది.
ఈ కేసు దర్యాప్తులో మరియు విచారణలో కీలక పాత్ర పోషించిన అధికారులు: వి. కిషోర్, సబ్ ఇన్‌స్పెక్టర్, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్. ఎ. రామదేవి, స్పెషల్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్. కె. ప్రతాప్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్. టి. కల్పన, ఎ.ఆర్. హిమ మీనన్, లీగల్ కౌన్సెలర్లు (భరోసా). శివ జ్యోతి (డబ్ల్యూ 31046), కోర్ట్ డ్యూటీ ఆఫీసర్, ముషీరాబాద్ పిఎస్. వీరబాబు (పి సి -30169), వి. సంతోష్ (పి సి -4107), సమ్మన్స్ డ్యూటీ అధికారులు.
ఈ కేసు విచారణ ప్రక్రియను ఉమెన్ సేఫ్టీ డీసీపీ డాక్టర్ లావణ్య ఎన్.జె.పి, ఏసీపీ ప్రసన్న లక్ష్మి, భరోసా ఇన్‌స్పెక్టర్ పి. పద్మ, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ మేరీ అగస్టిన్ నిరంతరం పర్యవేక్షించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్, ఈ కేసులో సమన్వయంతో పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులందరినీ అభినందించారు.

# బయ్యారం మండలం యువ శాస్త్రవేత్తకు జాతీయ స్థాయి గుర్తింపు

- డా. కె. వంశీ కృష్ణకు బెస్ట్ లీడర్షిప్ అవార్డు

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి:( జన సంఘర్షణ )
గచ్చిబౌలి, హైదరాబాద్: బయ్యారం మండలం, వెంకట్రాంపూర్ గ్రామానికి చెందిన ప్రతిభావంతుడైన విద్యావేత్త డా. కె. వంశీ కృష్ణ మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుతం కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేపీఆర్ఐటీ)లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగాధిపతిగా సేవలందిస్తున్న ఆయనకు గచ్చిబౌలిలో నిర్వహించిన ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ హ్యాకథాన్ కార్యక్రమంలో డబ్ల్యుటీఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో "బెస్ట్ లీడర్షిప్ అవార్డు" ప్రదానం చేయబడింది. ఈ అవార్డు ఆయన విద్యా రంగంలో చూపుతున్న విశేష నాయకత్వానికి ప్రతీకగా నిలిచింది. ముఖ్యంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారికి శిక్షణ అందించడం వంటి అంశాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులకు దేశీయ, అంతర్జాతీయ స్థాయి ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించడంలోనూ, వారిని ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉద్యోగాలకు సిద్ధం చేయడంలోనూ ఆయన కృషి ప్రశంసనీయంగా నిలిచింది. డా. వంశీ కృష్ణ నాయకత్వంలో సీఎస్ఈ విభాగం అకాడమిక్ రంగంలోనే కాకుండా పరిశోధన, ఇన్నోవేషన్, స్టార్టప్ ప్రోత్సాహం వంటి




రంగాల్లోనూ ముందంజలో ఉంది. విద్యార్థులు హ్యాకథాన్లు, టెక్నికల్ కాంపిటిషన్లలో పాల్గొని జాతీయ స్థాయిలో విజయాలు సాధించేలా ఆయన నిరంతరం ప్రోత్సహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తి జాతీయ స్థాయిలో ఇలాంటి గౌరవాన్ని అందుకోవడం బయ్యారం మండలానికి గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- 21వవార్డులో రేపు 'గ్రామసభ'
- వార్డు ప్రజలకు అండగా నిలుస్తున్న కౌన్సిలర్ నీలపు రమేష్

ఇల్లందు ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)
భద్రాద్రి (స్థానిక ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటూ, నిరంతరం ప్రజల మధ్యే ఉండే 21వ వార్డు కౌన్సిలర్ నీలపు రమేష్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వార్డులోని పెండింగ్ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా రేపు (గురువారం) ప్రత్యేక గ్రామసభను నిర్వహిస్తున్నారు.
వార్డు అభివృద్ధిలో రమేష్ మార్క్ : వరుసగా రెండోసారి కౌన్సిలర్‌గా విజయం సాధించి, ప్రజల మన్ననలు పొందిన నీలపు రమేష్, తన వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. రెండో విడతలో కూడా అదే ఉత్సాహంతో, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాలనే తపనతో ఆయన పని చేస్తున్నారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడం ఆయన పనితీరుకు నిదర్శనం.



గ్రామసభ వివరాలు: తేదీ: 02-04-2026 (గురువారం), సమయం: ఉదయం 9:00 గంటలకు, వేదిక: రైల్వే ట్రాక్ పక్కన, ముస్తఫా గారి ఇంటి ప్రాంగణం.
ప్రధాన అజెండా: ఈ సభలో ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై చర్చించి, బాధితుల నుంచి వినతులు స్వీకరించనున్నారు:
ఇందిరమ్మ ఇళ్లు: అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరు ప్రక్రియ.
కొత్త పింఛన్లు: వృద్ధాప్య, వితంతు, ఇతర పింఛన్ల దరఖాస్తుల పరిశీలన.
రేషన్ కార్డులు: కొత్త కార్డుల జారీ, మార్పులు-చేర్పులు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ నీలపు రమేష్ మాట్లాడుతూ.. "ప్రభుత్వ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హుడికి చేరాలన్నదే నా ఆశయం. అందుకే ఈ గ్రామసభను నిర్వహిస్తున్నాం. ఏవైనా సమస్యలు ఉన్నవారు నేరుగా వచ్చి మమ్మల్ని సంప్రదించవచ్చు" అని తెలిపారు. ఈ సభలో కౌన్సిలర్‌తో పాటు గ్రామ కమిటీ సభ్యులు కూడా పాల్గొని ప్రజల సందేహాలను నివృత్తి చేయనున్నారు. కావున, 21వ వార్డు ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది.

# రేపు గ్రామ, వార్డు సభలు.. ప్రభుత్వ సూచనలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)




1) ఉ.10గంటలకు రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ' ఆలపించి, సభను ప్రారంభించాలి.
2) గ్రామసభలో సర్పంచ్ తోపాటు పాలకవర్గం, వార్డు సభలో మున్సిపల్ ఛైర్మన్‌తోపాటు పాలకవర్గం, అధికారులు, ప్రజలు హాజరుకావాలి.
3) సీఎం సందేశాన్ని చదివి వినిపించాలి.
5) ప్రభుత్వ విజయాలు, 6గ్యారంటీలపై అవగాహన కల్పించి, పథకాలకు అర్హులను గుర్తించాలి.
6) ప్రజాసమస్యల కోసం ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయాలి.. పరిష్కారాలపై కార్యాచరణ రూపొందించాలి.

# క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు 80 మంది ఎంపిక

ఇల్లందు ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)



ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన క్రీడా పాఠశాలల్లో ఐదో తరగతి అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని, బ్యాటరీ టెస్టుల ద్వారా మొత్తం 80 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ వెల్లడించారు. కిన్నెరసాని, కచేనపల్లి మైదానాల్లో నిష్ణాతులైన క్రీడా శిక్షకుల పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన ఈ ఎంపికల్లో.. 105 మంది బాలుర నుంచి 40 మందిని, 72 మంది బాలికల నుంచి 40 మందిని తుది ప్రవేశాలకు ఎంపిక చేశారు. విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

# గిరిజన మహిళా సాధికారతకు 'భద్రగిరి మార్ట్' ఊతం

- పీవో రాహుల్ చొరవపై ప్రశంసలు

భద్రాచలం ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)




భద్రాచలం: గిరిజన ప్రాంతాల అభివృద్ధి, అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ మరో వినూత్న ముందడుగు వేశారు. గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆయన ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన 'భద్రగిరి మార్ట్' ఇప్పుడు మహిళా సాధికారతకు నిలువుటద్దంగా నిలుస్తోంది. బుధవారం ఈ మార్ట్‌ను సెర్ప్ సీనియర్ మేనేజర్ భవాని శంకర్ సందర్శించగా, పీవో రాహుల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యకలాపాలను చూసి ఆయన అభినందించారు. ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించిన అనంతరం భవాని శంకర్ మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమం కోసం మొదటి నుంచి పీవో రాహుల్ చేస్తున్న కృషి అమోఘమని, ఈ మార్ట్ ద్వారా మహిళలకు తమ సంస్థ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పీవో అంకితభావం వల్ల ఎంతో మంది గిరిజన మహిళలకు ఉపాధి మార్గాలతో పాటు వారి కష్టానికి తగిన ఫలితం దక్కుతోందని అధికారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

కామారెడ్డి, ఏప్రిల్ 1 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా, కామారెడ్డిలో ఎస్సీలకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించాలని సమాచార హక్కు చట్ట ప్రతినిధి రాజు కోరారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య కు వినతిపత్రం అందజేశారు. బుధవారం కామారెడ్డి మండలం నుండి నరసన్నపల్లి గ్రామానికి వెంకటయ్య వెళ్లారు. ఎస్సీ, ఎస్టీల నిరుద్యోగ యువత కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటుందన్నారు.

# పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్


భిక్కనూర్, ఏప్రిల్ 1 ( జన సంఘర్షణ )




కామారెడ్డి జిల్లా, బిక్కనూర్ మండలం తమకు రావలసిన బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ పాఠశాలకు తాళం వేశారు. ఈ ఘటన బుధవారం భిక్కనూర్ మండలం ఈసన్నపల్లిలో జరిగింది. గత ప్రభుత్వ హయాంలో మనబడి పథకం కింద రూ.20 లక్షల వ్యయంతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను బయటకు పంపి తరగతి గదులకు తాళాలు వేశారు. తమకు రావలసిన బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్ డిమాండ్ చేశారు.

# పాల్వంచలో విశ్వహిందూ పరిషత్ 'జిల్లా వర్గ' శిక్షణ శిబిరం

పాల్వంచ ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)




భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేందుకు, సంస్థాగత బలోపేతం కోసం ఏప్రిల్ 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు 'జిల్లా వర్గ' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కార్యవర్గం ప్రకటించింది.
శిక్షణ వివరాలు:
తేదీలు: 2026 ఏప్రిల్ 4, 5 (శని, ఆదివారాలు).
వేదిక: శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల, పాల్వంచ.
ముఖ్య గమనిక: పాల్గొనే కార్యకర్తలు ఏప్రిల్ 4వ తేదీ ఉదయం 7 గంటల వరకు వేదిక వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం సమారోప్‌తో ఈ శిబిరం ముగుస్తుంది.
కార్యక్రమ ఉద్దేశ్యం: జిల్లాలోని గ్రామ, ప్రఖండ, జిల్లా స్థాయి కార్యకర్తలతో పాటు పూర్తి సమయ కార్యకర్తలకు సంస్థపై పూర్తి అవగాహన పెంచడం, వారిని సుశిక్షితులుగా తీర్చిదిద్దడమే ఈ రెండు రోజుల శిక్షణ ప్రధాన లక్ష్యం. పాల్వంచ బస్టాండ్ పక్కన ఉన్న కూరగాయల మార్కెట్ రోడ్డు మీదుగా ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న వేదిక వద్దకు కార్యకర్తలు చేరుకోవాలని సూచించారు.
కార్యకర్తలకు సూచనలు: శిక్షణకు వచ్చే వారు వెంట ఒక కలము, నోట్ పుస్తకం, చలికి తట్టుకోగలిగే దుస్తులు, శారీరక వ్యాయామాలకు అనువైన దుస్తులతో పాటు ఇతర నిత్యవసర వస్తువులను తీసుకురావాలని నిర్వాహకులు కోరారు.
సంప్రదించాల్సిన వారు: ఈ కార్యక్రమంపై మరిన్ని వివరాల కోసం జిల్లా సహకార్యదర్శి కొమ్ము నరేష్ (9000449551) లేదా పాల్వంచ ప్రఖండ కార్యదర్శి దాసరి మాధవరావు (9502945921) లను సంప్రదించవచ్చు. ఈ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు చిలుకూరి నాగేశ్వరరావు, జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత పిలుపునిచ్చారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం


ఎల్లారెడ్డి, ఏప్రిల్ -1(జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి పట్టణంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా, ఎల్లారెడ్డి పోలీసుల ఆధ్వర్యంలో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నందు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల కంటి చూపు కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరంలో 62 మందికి పైగా డ్రైవర్లు పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందించారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగి, ట్రాఫిక్ నియమాలు పాటించాలని డీఎస్పీ శ్రీనివాసులు డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాజారెడ్డి, ఎస్సై బొజ్జ మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ముంగిటకే 'ప్రజా పాలన': రేపు జిల్లావ్యాప్తంగా గ్రామసభల జాతర!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలోని పల్లెలు రేపు ప్రజాస్వామ్య వేదికలుగా మారబోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 471 గ్రామ పంచాయతీల్లో గురువారం నాడు భారీ ఎత్తున గ్రామసభలు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) సుధీర్ కుమార్ ప్రకటించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా చేపట్టనున్న ఈ సభల ద్వారా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యంత్రాంగం సిద్ధమైంది.

ముఖ్య విశేషాలు: సమస్యలపై సమరం: కేవలం చర్చలకే పరిమితం కాకుండా, స్థానిక సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించడమే ఈ సభల ప్రధాన ఉద్దేశం.

పథకాల సమీక్ష: ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అందుతున్నాయి? ఎక్కడ అడ్డంకులు ఉన్నాయి? అనే అంశాలపై డిపిఓ సుధీర్ కుమార్ నేరుగా దృష్టి సారించారు.

అధికారుల అప్రమత్తం: ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా, సభల నిర్వహణపై ఇప్పటికే మండల స్థాయి అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టే ప్రసక్తే లేదని, ఈ గ్రామసభల ద్వారా పల్లె ప్రగతికి కొత్త రూపునిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యంత్రాంగం కోరుతోంది.

## గండిమాసానిపేట్‌లో పాల శీతలీకరణ కేంద్రంను పరిశీలించిన డీఆర్డీవో

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -1 (జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు గండిమాసానిపేట్‌లోని పాల శీతలీకరణ కేంద్రాన్ని బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళా శక్తిలో భాగంగా ఎల్లారెడ్డి మండల సమాఖ్య ద్వారా నడపడానికి సాధ్యసాధ్యలను పరిశీలించారు. పాల ఉత్పత్తిదారులు ఎక్కువ లబ్ధి చేకూరిన ప్రాణాళిక సిద్ధం చేస్తున్నట్లు అయిన తెలిపారు. లబ్ధిదారులు పాడి గేదెలు కొనుగోలు చేసేలా బ్యాంకు లింకేజ్ ద్వారా మహిళ సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. రైతులకు ఆదాయం వచ్చే విధంగా మహిళా సంఘాలకు అప్ప చెప్పడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

## సీఎస్పీ బస్తీలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామసభ

ఇల్లందు ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రేపు (ఏప్రిల్ 2, గురువారం) ఉదయం 9 గంటలకు సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించనున్న భారీ 'గ్రామసభ'కు రంగం సిద్ధమైంది. స్థానిక సర్పంచ్ మోకాళ్ళ లావణ్య అధ్యక్షతన జరగనున్న ఈ కీలక సభకు కోరం ఎమ్మెల్యే కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ప్రజా సమస్యలపై దిశానిర్దేశం చేయనున్నారు. కావున ఈ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు, సభ విశేషాలను కవర్ చేసేందుకు మీడియా ప్రతినిధులందరూ సకాలంలో హాజరుకావాలని సర్పంచ్ ప్రత్యేకంగా కోరారు.

# సింగరేణి నిర్వాసితులపై ఖాళీ వేటు..

◆ రోడ్డున పడనున్న వందలాది కుటుంబాలు!
◆ అధికారుల తీరుపై మండిపడుతున్న అఖిలపక్షం: తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్

ఇల్లందు ఏప్రిల్ 1 (జన సంఘర్షణ)



సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు నిర్వాసిత ప్రాంతాల్లో కార్చిచ్చు రగిలిస్తున్నాయి. విజయలక్ష్మి నగర్, ఓసీ నిర్వాసిత ప్రాంత ప్రజలను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తక్షణమే ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించడంతో, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏకపక్ష నిర్ణయాన్ని నిరసిస్తూ బుధవారం అఖిలపక్ష కమిటీ, స్థానిక సర్పంచులు సింగరేణి ఎస్ ఓ టు జీఎంను కలిసి ఘాటుగా నిలదీశారు.

ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం తగదు: ముందస్తు నోటీసులు లేకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపకుండా పేద ప్రజలను ఇళ్ల నుండి ఖాళీ చేయాలని చెప్పడం అమానుషమని నాయకులు అధికారులకు స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి ఇక్కడే జీవనం సాగిస్తున్న వందలాది కుటుంబాలను అర్ధాంతరంగా రోడ్డున పడేయడం సరైన విధానం కాదని, ఇది ప్రజలను మానసిక ఆందోళనకు గురి చేయడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ అనుమతితోనే నిర్ణయాలు ఉండాలి: ఏదైనా ప్రాంతాన్ని ఖాళీ చేయించాల్సి వస్తే, ప్రభుత్వం నుండి పూర్తిస్థాయి అనుమతులు తీసుకోవాలని, బాధితులతో చర్చించి వారికి న్యాయం చేయాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, తిలక్ నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, మంచాల వెంకటేశ్వర్లు, ఎట్టి హరికృష్ణ, తాండ్ర నాగరాజు, చిన్నారి, వడ్ల శ్రీను, ధనసరి రాజు, తేజవత్ లాలు, ఖాసీం, మొగిలి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అధికారులు మొండిగా వ్యవహరిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఓటరు జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వొద్దు


◆ ఆర్డీఓ ప్రభాకర్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ - 1(జన సంఘర్షణ )



గ్రామాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారం బాధ్యతాయుతంగా విధులు నిర్వహి ంచాలని ఆర్డీఓ ప్రభాకర్ అన్నారు. బుధ వారం మండలంలోని మీసాన్ పల్లి రైతు వేదికలో బీఎల్ఓలకు, బీఎల్ సూపర్‌వైజర్లకు ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ప్రభాకర్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు-చేర్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పనపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. తప్పులు దొర్లితే బీఎల్ఓలదే బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమం తహసీల్దార్ ప్రేమ్ కుమార్, డిప్యుటీ తహసీల్దార్ శ్రీనివాస్, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఏఎంసీ చైర్మన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి, ఏప్రిల్ -1(జన సంఘర్షణ )


ప్రస్తుత ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిత భర్త మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ జూబ్లీహిల్స్‌లోని మాఈఎన్టీ ఆసుపత్రిలో గొంతు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రామ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వైద్యులతో మాట్లాడి అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయో తెలుసుకున్నారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఉన్నారు.

# ఆంజనేయ దీక్ష ఘనం

ఖమ్మం సింగరేణి ప్రతినిధి ఏప్రిల్ 01 :(జన సంఘర్షణ )

భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ సామ్య తండా పరిధిలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి దీక్ష విరమణ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. గ్రామం అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తుల రాకపోకలతో ఆలయం సందడిగా మారింది. దీక్షలో పాల్గొన్న భక్తులు నియమ నిష్ఠలను కచ్చితంగా పాటిస్తూ దీక్షను పూర్తిచేసుకుని, సంప్రదాయబద్ధంగా ఇరుముడి కట్టుకుని స్వామివారిని దర్శించుకున్నారు. దీక్ష విరమణ అనంతరం ఇరుముడి ధరించిన భక్తులు ఆలయంలో ప్రత్యేక హోమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సంపదాభివృద్ధి కోసం భక్తులు సామూహికంగా ప్రార్థనలు చేశారు. పూజల సమయంలో ఆలయ ప్రాంగణం అంతటా భక్తి భావం వెల్లివిరిసింది. వేద మంత్రాల నడుమ నిర్వహించిన హోమాలు ఆధ్యాత్మికతను మరింత పెంపొందించాయి. భారీ సంఖ్యలో మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి పోలంపల్లి దిశా కమిటీ సభ్యురాలు, గ్రామపంచాయతీ సర్పంచ్ హేమలత బాలాజీ, ఉప సర్పంచ్ గుగులోత్ సర్వన్, పాత్రికేయుడు వాంకుడోత్ బన్సీలాల్, అక్షరం ఆయుధం బృంద సభ్యులు భూక్యా రవీందర్, బోడ రవి, హట్కర్ రాంబాబు, అంగోత్ రాములు, వాంకుడోత్ రవికుమార్, క్రాంతి రిపోర్టర్ కళ్యాణ్, గుగులోత్ నవీన్ నాయక్ తదితరులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ గ్రామ ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. గ్రామ పెద్దలు లావుడియా ఈరియా నాయక్ లక్ష్మి దంపతులు సహా





అనేక మంది భక్తులు పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం గ్రామంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు భక్తి భావాన్ని మరింత బలపరిచిన సందర్భంగా నిలిచింది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
గురువారం 02 ఏప్రిల్ 2026

# మూడు రోజులపాటు మిషన్ భగీరథ తాగునీరు సరఫరాకు ఆటంకం

◆ **ప్రజలు సహకరించాలి... మిషన్ భగీరథ అధికారులు**



తెలంగాణ /ఏప్రిల్ 1/(జన సంఘర్షణ)

ప్రతి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో తొమ్మిది వందల కోట్ల రూపాయలు వెచ్చించి సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టు వద్ద వాటర్ ట్రేట్ మెంట్ ప్లాంట్ సింగూరు జూకల్ సెగ్మెంట్ పరిధిలోని గ్రామాలకు ఈనెల మూడవ తేదీ వరకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిపి వేసినట్లు మిషన్ భగీరథ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా మెదక్‌బిరుద్రూర్. బిచ్కుంద పట్టణంలో మిషన్ భగీరథ పైప్లైన్ మరమ్మత్తుల్లో భాగంగా జుకల్ నియోజకవర్గం, బాన్సువాడ నియోజకవర్గం, బోధన్ నియోజకవర్గం, ఎల్లారెడ్డి మండలంలోని ఐదు మండలాలకు మిషన్ భగీరథ నీరు ఈనెల మూడవ తేదీ వరకు సరఫరా నిలిపివేశారు. ముఖ్యంగా రహదారుల మరమత్తులో భాగంగా సింగూరు ప్రధాన పైప్లైన్ మరమ్మత్తుల్లో భాగంగా మిషన్ భగీరథ నీరు అందించలేకపోతున్నామని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు మంచినీటి కటకట ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకుల ద్వారా గ్రామస్తులకు నీటిని అందిస్తున్నారు. మార్మూల గ్రామంలో నీటి ఎద్దడి ఇప్పటినుంచే మొదలైంది. ముఖ్యంగా జూకల్ నియోజకవర్గం, నారాయణఖేడ్, జహీరాబాద్, మెదక్, గాంధారి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బీర్కూర్, బోధన్, ఎడపల్లి, నవీపేట్, నందిపేట్, మండలాల్లోని మార్మూల గ్రామాలకు స్వచ్ఛమైన మంచినీరు అందకపోవడంతో, గ్రామంలోని చేతి బోర్లపై ఆధారపడుతున్నారు. వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తీసుకువస్తున్నారు. మూడు రోజుల వరకు మిషన్ భగీరథ నీళ్లు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

# అన్నం పెట్టిన బామ్మ మృతి... ఆవేదనతో అరుస్తూ కన్నీళ్లు పెట్టుకున్న వానరం!

◆ **మానవత్వాన్ని మేల్కొలిపిన హృదయ విదారక ఘటన**

జన సంఘర్షణ డెస్క్. ఏప్రిల్ 01 .



కర్ణాటక, చెన్నపట్టణ: మనుషుల మధ్య అనుబంధాలు క్రమంగా మసకబారుతున్న ఈ కాలంలో, ఒక వానరం చూపిన ప్రేమ, కృతజ్ఞత అందరినీ కంటతడి పెట్టించింది. చెన్నపట్టణలో నివసిస్తున్న 85 ఏళ్ల వృద్ధురాలు ప్రతిరోజూ ఒక కోతికి అన్నం పెట్టేది. ఆ బామ్మతో ఆ వానరానికి ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. ఆమెను చూసిన ప్రతీసారి ఆ కోతి ఆనందంగా దగ్గరకు వచ్చేది. అయితే ఇటీవల ఆ వృద్ధురాలు మృతి చెందింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఆ వానరం ఆమె ఇంటి వద్దకు చేరుకుని, పసిపిల్లలా విలవిలలాడుతూ రోదించింది. బామ్మ మృతదేహం పక్కనే కూర్చొని, కదలకుండా ఉండటం చూసిన స్థానికులు భావోద్వేగానికి లోనయ్యారు. ఆ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించింది. మానవ సంబంధాలు మరిచిపోతున్న సమాజానికి ఇది ఒక గట్టి సందేశంగా నిలిచింది. జంతువులకూ ప్రేమ, కృతజ్ఞత ఉంటాయని... మనుషులు మరిచిపోతున్న విలువలను ఈ వానరం మరోసారి గుర్తు చేసింది.

# శ్రీ అభయ ఆంజనేయ స్వామి పల్లెకి సేవ ఊరేగింపు, హోమం

నిజామాబాద్ జిల్లా . పోతంగల్ . ఏప్రిల్ 01 . (జన సంఘర్షణ )



పోతంగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి మందిర విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రారంభోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కేసరి రంగు కండువాలు ధరించి, జై శ్రీరామ్ నినాదాల మధ్య భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ వేడుకల్లో భాగంగా రెండవ రోజు తమలూరు మహారాజ్ గారి ప్రవచనం, అలాగే మూడవ రోజు భావాసావా లింగ అవధూత మహరాజ్ దివ్య ప్రవచన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఏప్రిల్ 2న విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతితో ఈ వేడుకలు ముగియనున్నాయి. భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామి .వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, గ్రామస్తులు చిన్నలు పెద్దలు, తోటి ఆడపడుచులు, తదితరులు, పాల్గొన్నారు

# నేడు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పర్యటన

ఖమ్మం సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ )



వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ (ఏప్రిల్ 2, గురువారం) పలు అభివృద్ధి, ఆధ్యాత్మిక, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ తమ మండలాల్లో జరిగే కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. పర్యటనలో భాగంగా ఉదయం 9:30 గంటలకు జూలూరుపాడు మండలం కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని జడలచింత గ్రామంలో నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మి-శ్రీ అంకమ్మ అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 10:00 గంటలకు అనంతారం గ్రామపంచాయతీలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా జరిగే గ్రామసభలో హాజరవుతారు. తదుపరి ఉదయం 10:30 గంటలకు అనంతారం గ్రామంలో నిర్వహించే వివాహ కార్యక్రమంలో పాల్గొని, ఉదయం 11:00 గంటలకు ఎన్కూర్ మండలం హిమంనగర్ గ్రామపంచాయతీలో జరిగే ప్రజా పాలన గ్రామసభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:40 గంటలకు వైరా పట్టణం 14వ వార్డులో నిర్వహించబడే వార్డు సభలో పాల్గొని స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించనున్నారు. ఈ పర్యటనలో ప్రజా సమస్యలు తెలుసుకోవడం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించడం ప్రధాన లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. మీడియా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# ముకుందపురంలో సేవాలాల్ సేన నేతల సందర్శన

ఇల్లందు, ఏప్రిల్ 01: (జన సంఘర్షణ )



ముకుందపురం గ్రామంలోని తుమ్మలపల్లి ప్రసాద్ నివాసానికి సేవాలాల్ సేన వ్యవస్థాపకులు భూక్యా సంజీవ్ నాయక్ ఈరోజు మర్యాదపూర్వకంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సానుకూల వాతావరణం నెలకొని, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్శన సందర్భంగా సేవాలాల్ సేన కార్యకలాపాలు, సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, స్థానిక ప్రజల సమస్యలు వంటి అంశాలపై నేతలు పరస్పరం చర్చించుకున్నారు. గ్రామ అభివృద్ధి, సామాజిక ఐక్యత, యువత భాగస్వామ్యం పెంపు వంటి విషయాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ నాయక్‌తో పాటు అనిల్ రెడ్డి, బండారి శ్రీను, శోభన్ బాబు, సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు. అలాగే ఇల్లందు మండలం సేవాలాల్ సేన కన్వీనర్ , ధనియాలపాడు ఉప సర్పంచ్ ఆంగోత్ ఆంజనేయులు, సరిలాల్, లచ్చు, ఇల్లందు టౌన్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, లలిత్ కుమార్ పాసి, ఫైనాన్స్ ఇమ్రాన్, మండల నాయకులు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు సేవాలాల్ సేన బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేయాలని నిర్ణయించారు.

# దోమకొండ: జాతీయ స్థాయికి గురుకుల విద్యార్థిని

దోమకొండ, ఏప్రిల్ 1 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా, దోమకొండలోని బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని స్వేచ్ఛ రగ్బీ ఆటలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చైతన్య సుధా తెలిపారు. పట్టుదలతో కృషి చేస్తే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని ప్రిన్సిపల్ అన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## ఉర్దూ మీడియం హంగర్గ ఫారం పాఠశాలల్లో పదవ తరగతి పిల్లల వీడుకోలు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎంఏ హకీమ్


పోతంగల్ /ఏప్రిల్ 1/(జన సంఘర్షణ)



బుధవారం ఫారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం 2 పదవ తరగతి పిల్లల వీడ్కోలు సభలో డాక్టర్ ఎంఏ హకీం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . వీరు పిల్లలకు శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. వీరితో పాటు ప్రధాన ఉపాధ్యాయలు ముజాహిద్‌కి, గ్రామ పెద్దలైనా మాజీ సర్పంచ్ ఎజాజ్ ఖాన్‌కి తదితర గ్రామ ప్రజలకు శాలువాతో సన్మానించి నారు. వీటితోపాటు ఏజాజ్ ఖాన్ మాజీ సర్పంచ్ సజాద్ ,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వాలిఉద్దీన్ తదితర గ్రామ ప్రజలు ఉపాధ్యాయులు ఇట్టి వీడ్కోలు సభలో పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ సన్నిధానంలో అయ్యప్ప జన్మదిన వేడుకలు

పొతంగల్/ఏప్రిల్ 1/( జన సంఘర్షణ)



ఘనంగా మండలం లోని శ్రీ అయ్యప్ప స్వామి వారి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో స్వామి వారి అభిషేకాని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వామి, శంకర్ సార్, డాక్టర్ రమేష్, యశ్వంత్, గజ్జు, ఇరువంత్, హనుమాన్ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ సబ్ కలెక్టర్ తిర్మలాపూర్ గ్రామ పంచాయతీకి రావడం జరిగింది.

పొతంగల్/ఏప్రిల్ 1/(జన సంఘర్షణ)



పొతంగల్ మండల కేంద్రంలో రేపు జరగబోయే గ్రామ సభ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అన్ని డిపార్ట్మెంట్ల డేటా గురించి ప్రభుత్వ లబ్ది గురించి, ప్రభుత్వ పథకాలు ఎవరెవరు బెనిఫిషర్స్ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని తెలుసుకున్నారు గ్రామంలో ఉన్నటువంటి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్, సర్పంచ్ బోయి సైదవ్వ, ఎంపీడీవో చందర్ , పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ రూరల్ సీఐగా అంజలి బాధ్యతల స్వీకారం

ఇల్లెందు ప్రతినిధి ఏప్రిల్ 01:(జన సంఘర్షణ )



మహబూబాబాద్ రూరల్ సీఐగా సీఐ అంజలి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఆర్‌సీ సీపీఎల్స్ సివిల్ ప్రొడక్షన్ లీగల్ సెల్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య రావూరి ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అంజలి తన సేవల ద్వారా మహబూబాబాద్ రూరల్ ప్రాంత ప్రజలకు న్యాయం, భద్రత కల్పించి మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆమె సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

## కొండగట్టులో కూలిన చలవ పందిరి..

◆ **15మంది భక్తులకు గాయాలు**

◆ **ఆలయ కమిటీ నిర్వాకులపై భక్తుల అగ్రహం**



తెలంగాణ కొండగట్టు/ఏప్రిల్ 1/(జన సంఘర్షణ)

జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో అపశృతి చోటుచేసుకుంది. ఆలయం వద్ద హనుమాన్ విజయ సందర్భంగా ఏర్పాటు చేసిన చలువ పందిరి అకస్మాత్తుగా కూలిపోవడంతో సుమారు 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నాసిరకంగా పందిరి నిర్మించారని ఆరోపిస్తున్నారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, విచారణకు ఆదేశించారు.

# కంఠమయ్య గుడి అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయాలి

**-మేడ్చల్ కలెక్టర్కు వినతిపత్రం అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**



**ఉప్పల్ జనసంఘర్షణ :**
కుషాయిగూడలో గౌడ కుల స్థుల ఆరాధ్యదైవంగా ప్రసిద్ధి చెందిన శ్రీ కంఠమహేశ్వర స్వామి (కంఠమయ్య) ఆలయ అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆలయంలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు తక్షణమే నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆలయ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినతిపై సానుకూలంగా స్పందిస్తూ, త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షులు నేమురి మహేష్ గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, బుడంపల్లి రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాడుగులపల్లి ఐకెపి సెంటర్లో ధాన్యం కొనుగోలు లోటుపాట్లపై కిసాన్ మోర్చా ధ్వజం



**ప్రజావారధి జనసంఘర్షణ :**
మండల కేంద్రంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి బుధవారం సందర్శించారు ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జరుగుతున్న జాప్యం,లోటుపాట్ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం అన్నదాతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తరుగు తూకం విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో ఉన్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ఒత్తిడి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి కాసేపు సరదాగా ముచ్చటించి వారిలో ధైర్యాన్ని నింపారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఇటికాల జాన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, మండల వెంకన్న, ఇందుగుల బూత్ అధ్యక్షులు బాల్నే కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న, విజయలక్ష్మి, రమాదేవి, సత్యం రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 968 గజాల పార్కును కాపాడిన హైడ్రా










**కూకట్పల్లి జనసంఘర్షణ :**
మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, గ్రామంలోని అక్షయ ఎన్క్లేవ్ పేరుతో1983 వ సంవత్సరంలో 7.12 ఎకరాల్లో లే ఔట్ వేశారు. హుడా అనుమతి పొందిన లే ఔట్లో 968 గజాల మేర ఉన్న పార్కును తప్పుడు పత్రాలతో అబ్దుల్ రెహ్మాన్ అలియాస్ గోపాల్ అనే వ్యక్తి కొట్టేయాలని ప్రయత్నిస్తున్నారని స్తానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఈ ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా అధికారులు పార్కు స్థలంగా నిర్ధారించుకున్నారు. ఇప్పటికే జీహెచ్ ఎంసీ ప్రహరీ నిర్మించి గేటు కూడా పెట్టిన విషయాన్ని గుర్తించారు. 2019లో తప్పుడు పత్రాలతో నిర్మాణ అనుమతులు కూడా తెచ్చుకుని ఆక్రమణలకు సిద్ధం కగా.. కబ్జాదారులపై జీహెచ్ ఎంసీ అధికారులతో పాటు.. సొసైటీ ప్రతినిధులు కూడా కేసులు పెట్టారు. 968 గజాల పార్కు స్థలంలో కబ్జాదారులు వేసిన సామగ్రిని తొలగించి పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు.మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, గ్రామంలోని అక్షయ ఎన్క్లేవ్ పేరుతో1983 వ సంవత్సరంలో 7.12 ఎకరాల్లో లే ఔట్ వేశారు. హుడా అనుమతి పొందిన లే ఔట్లో 968 గజాల మేర ఉన్న పార్కును తప్పుడు పత్రాలతో అబ్దుల్ రెహ్మాన్ అలియాస్ గోపాల్ అనే వ్యక్తి కొట్టేయాలని ప్రయత్నిస్తున్నారని స్తానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఈ ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా అధికారులు పార్కు స్థలంగా నిర్ధారించుకున్నారు. ఇప్పటికే జీహెచ్ ఎంసీ ప్రహరీ నిర్మించి గేటు కూడా పెట్టిన విషయాన్ని గుర్తించారు. 2019లో తప్పుడు పత్రాలతో నిర్మాణ అనుమతులు కూడా తెచ్చుకుని ఆక్రమణలకు సిద్ధం కగా..

# కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలి

- లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే.ఎమ్మార్వో







**ఉప్పల్ జనసంఘర్షణ :**
రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఈ మేరకు లబ్ధిదారులకు ప్రయోజనాలు కల్పించాలని సూచించారు. ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 172 కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నదని చెప్పారు.అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ ప్రయోజనాలను అందించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప్పల్ డిప్యూటీ తహశీల్దార్ డి,సునీల్ కుమార్,ఉప్పల్ ఆర్ఐలు ఎం.అశ్విని గౌడ్,ఎ.వీరేంద్ర సాయి,జూనియర్ అసిస్టెంట్ లు ఎం,అనంత రాములు, పి.వెంకన్న, ఎం,అలివేలు వనిత,అటెండర్స్ సత్యనారాయణ, సంజీవ, స్వామి,రెవెన్యూ సిబ్బంది,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్లో బయోగ్యాస్,ఆర్వో ప్లాంట్ల ప్రారంభం

**-వోయిత్ టర్బో సిఎస్ఆర్ నిధులతో రూ.5 లక్షల అభివృద్ధి**
**- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





**ఉప్పల్ జనసంఘర్షణ :**
నాచారం ఇండస్ట్రీ పరిధిలోని ప్రముఖ సంస్థ వోయిత్ టర్బో ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధుల ద్వారా మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్, ఆర్వో వాటర్ ప్లాంట్ను స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు వల్ల మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట గ్యాస్ ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అలాగే విద్యార్థుల్లో పునరుత్పాదక ఇంధనంపై అవగాహన పెంపొందుతుందని అన్నారు.ఇకపోతే, లైబ్రరీ అభివృద్ధికి అవసరమైన అల్మారాలు, కుర్చీలు కూడా సంస్థ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు, వోయిత్ టర్బో సంస్థ ప్రతినిధులు ఈశ్వర్ ప్రసాద్ (వైస్ ప్రెసిడెంట్), మోహనరెడ్డి, రాజశేఖర్ రెడ్డి (జనరల్ మేనేజర్లు), ఇంద్రజ, మహేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, పైళ్ల ప్రవీణ్ కుమార్, ధర్మారెడ్డి, కాసం రాజిరెడ్డి, దుల్మిట్టా దయాకర్ రెడ్డి, మెండ రఘువరన్, ప్రమోద్ తదితరులు హాజరయ్యారు.

# పోచమ్మ గుడి వీధిలో సి.సి రోడ్డు పనులకు శ్రీకారం

**-డ్రైనేజీ వివాదం పరిష్కారం**
**- ప్రజల సమ్మతితో ముందుకు పనులు**



**ఉప్పల్ జనసంఘర్షణ :**
ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ రాఘవేంద్ర నగర్ పరిధిలోని పోచమ్మ గుడి వీధిలో ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి చివరకు శ్రీకారం చుట్టారు. గతంలో కార్పొరేటర్గా ఉన్న శాంతి సాయిజెన్ శేఖర్ ఈ రహదారి నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు చేయించగా, తాజాగా పనులు ప్రారంభమయ్యాయి.మంగళవారం ఉదయం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు రాగా, కొంతమంది స్థానికులు డ్రైనేజీ సమస్యను ప్రస్తావిస్తూ ముందుగా పైపులైన్ మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు పనులు నిలిచిపోయాయి. ఈ విషయంపై బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ప్రాంతాన్ని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం సివరేజ్ సూపర్వైజర్తో చర్చించి, ప్రస్తుతం పైపులైన్ మార్పులు అవసరం లేదని స్పష్టం చేశారు. మ్యాన్హోల్స్ వద్ద పందికొక్కులు తవ్వడం వల్ల సమస్యలు వస్తున్నాయని గుర్తించి, వాటిని సిమెంట్ ప్లాస్టరింగ్ ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ నిర్ణయానికి స్థానికులు అంగీకరించి, రోడ్డు పనులకు సహకరించారు.దీంతో సి.సి రోడ్డు పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమంలో సోమ శ్రీనివాస్, నరేందర్ గౌడ్, ఉపేందర్ గౌడ్, మన్సూర్, అషు, విఠల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి సిపిఐ,ప్రజా సమస్యల పై నిత్యం పోరాటం

**-సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్**



**కుత్బుల్లాపూర్ జనసంఘర్షణ :**
భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఏప్రిల్ 1నుండి 10వ తేదీ వరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బాచుపల్లి మండలం నిజాం పేట్, ప్రగతి నగర్లో ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పై అలుపెరుగని పోరాటం చేసేది కేవలం భారత కమ్యూనిస్ట్ పార్టీ మాత్రమే అని గుర్తు చేశారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ 1925 డిసెంబర్ 26వ తేదీన కన్పూర్లో ఆవిర్భవించింది. అలాగే సంపూర్ణ స్వాతంత్రం కోసం తీర్మానం చేసిన మొదటి రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ అని గుర్తు చేశారు. కేరళ, పశ్చిమ బెంగాల్, శ్రీకాకుళం భూపోరాటాలు, తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం లాంటి అనేక పోరాటాలు నిర్వహించి అనేక మంది ప్రాణాలు త్యాగం చేసింది భారత కమ్యూనిస్ట్ పార్టీ అని అన్నారు. గతంలో అయినా ఇప్పుడు అయినా భూమి ఆకాశం వున్నన్ని రోజు సిపిఐ పార్టీ ఉంటుంది పేద ప్రజా సమస్యల పై పోరాటం చేస్తుంది అని అన్నారు. బాచుపల్లి మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించము అని ప్రజా సమస్యల పై దీక్షలు చేశాము అని గుర్తు చేశారు. ముఖ్యంగా దోమల నివారణ ముఖ్యమైన సమస్యగా మారింది అని, నిత్యావసరల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, సిఎంసీ, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజ్ పెండింగ్లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే దేశ వ్యాప్తంగా కార్మిక కొడ్లు రద్దు చేయాలనీ కార్మిక సంఘాల నిరసన చేస్తున్నాయి అని కనుక కార్మిక వెతిరేక కొడ్లను ఆపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, నర్సింహా, కృష్ణ, దుర్గయ్య, శ్రీను, శంకర్, మహేష్, మల్లేష్, వాసు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూ రాంనగర్ కాలనీలో రోడ్డు పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీత

**ఉప్పల్ జనసంఘర్షణ**
చిల్కానగర్ డివిజన్లోని న్యూ రాంనగర్ కాలనీ పీర్ల కొట్టం వెనకాల ఉన్న కాలనీలో 23 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీత .అనంతరం మాజీ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్లోని న్యూ రామ్ నగర్ కాలనీలో ఎలక్షన్ల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని పీర్ల కొట్టం వెనుకాల వైపున ఉన్న వీధులలో నూతన సీసీ రోడ్లను నిర్మించడం జరుగుతుందని అన్నారు, అదేవిధంగా కాంట్రాక్టర్ కి కూడా రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిర్మాణ సమయంలో ఎటువంటి జాప్యం జరిగిన కఠిన చర్యలు తప్పవని అన్నారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఎద్దుల కొండల్ రెడ్డి, జిల్లాల ప్రవీణ్, బస్తీ వాసులు శంకరయ్య చారి, కృపాకర్, తిరుపతి, సాయి చరణ్, మంజుల, జ్యోతి ,నవనీత, రేణుక మొదలగువారు పాల్గొన్నారు,

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
02 ఏప్రిల్ 2026

# నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**రక్తదానానికి భారీగా తరలివచ్చిన యువకులు**

**హనుమకొండ జనసంఘర్షణ :**






గ్రేటర్ వరంగల్ లోని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు సోదరుడు కాంగ్రెస్ యువ నాయకులు మామిండ్ల సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనయుడు కీర్తిశేషులు నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సోదరుడు నాయిని అమరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. న్యూశాయంపేట సర్కిల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో. 31 వ డివిజన్ కు చెందిన మామిండ్ల సురేష్ అభిమానులు,యువకులు 75 మంది రక్త దానం చేశారు. జన్మదిన సందర్భంగా కేకులు కట్ చేయడం కాదు. పార్టీలు చేసుకోవడం కాదు జన్మదిన అంటే. రక్త దానం చేస్తే సమాజానికి ఉపయోగప డుతుందని అతిధులు అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాల యం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్న మామిండ్ల సురేష్ మరియు మలికాంబ మనోవికాసం కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్ర మంలో డివిజన్ పెద్దలు కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ప్రజలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ..!

- దళితుల సంక్షేమానికి నాడు ఇందిరా గాంధీ.. నేడు రేవంత్ రెడ్డి
- నాచారం దళిత శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.72 మంజూరు పత్రాలను అందజేసిన పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ జనసంఘర్షణ :**





దళితుల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండి పని చేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు,నాడు ఇందిరా గాంధీ, నేడు సీఎం రేవంత్ రెడ్డి దళితుల పక్షాన నిలిచిన ప్రజా ప్రతినిధులుగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. నాచారం కార్తీకేయ నగర్ లో దళితుల శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1.72 కోట్ల నిధులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరు చేయించారు.దళిత సంఘాల నాయకులకు పరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరు పత్రాలను అందజేశారు,దేశంలో ఒక కాంగ్రెస్ పార్టీనే కుల, మతాలకు అతీతంగా దేశ ప్రజల అభ్యున్నతి కోసం పని చేస్తుందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.నేడు రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి గారు సైతం దళితుల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు,ఈకార్యక్రమంలో హెచ్ఆర్ మోహన్ గారు,గుంటుక కృష్ణా రెడ్డి,శ్రీకాంత్ గౌడ్,ప్రకాష్ రెడ్డి,నూతలకంటి రాజు,మహేష్ యాదవ్ ,పూర్ణిమ ,తుంగ తిరుపతి ,బండారి రఘు ,గడ్డ క్రాంతి,బొల్లం నరేష్ ,టిహెచ్ బాల్రాజ్ ,అబ్రహం ,గౌడెల్లి రాకేష్ ,ఏర్పుల నర్సింహ ,ఏర్పుల నాగరాజ్ ,ఏర్పుల శ్రీనివాస్ ,ఏర్పుల సుజాత ,ఏర్పుల రవీందర్ ,ఏర్పుల లక్ష్మీనారాయణ ,అయ్యగారి రమేష్ ,అయ్యగారి శ్రీకాంత్,అయ్యగారి హరీష్ ,అయ్యగారి పవన్ ,గౌడెల్లి శ్రీనివాస్ ,గౌడెల్లి సావిత్రి ,గౌడెల్లి రాకేష్ ,లడ్డా సుదర్శన్ ,మింద్రాల ప్రభాకర్,టి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు,

# గురుకుల ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**-ఏప్రిల్ 15 చివరి తేదీ**

**-హోతి-కె కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సురేఖ**



**జహీరాబాద్ జనసంఘర్షణ :**

తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల సంస్థ (TGRJC) ఆధ్వర్యంలో నడుస్తున్న రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు హోతి-కె పిఎం శ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదవ తరగతి (మార్చి 2026) పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఎంపీసీ,బైపీసీ, మరియు ఎంఈసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలు కల్పిస్తారు. వచ్చే నెల మే 3, 2026న నిర్వహించే 'టిజిఆర్జెసి సెట్-2026' ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రూ. 200/- దరఖాస్తు రుసుము చెల్లించి grjc.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో ఏప్రిల్ 15 2026 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.అర్హులైన గ్రామీణ మరియు పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సమీపంలోని గురుకుల పాఠశాల లేదా కళాశాలను సంప్రదించాలని ఆమె సూచించారు.

# సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

- నిరుపేద పోడు సాగుదారులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- పోడు భూముల్లో స్వేచ్ఛగా సాగు చేసుకునే వెసులుబాటు కల్పించండి
- సర్వే పూర్తయిన భూములకు పట్టాల జారీ చేయాలి
- అధికారులు స్పందించకుంటే పోడు రైతులకు అండగా పోరాడతాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

**కొత్తగూడెం జనసంఘర్షణ**

నిరుపేదలైన పోడు భూముల సాగుదారులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని, పేదలకు ఉపాధి లేకుండా చేసే చర్యలకు స్వస్తిచెప్పి సహకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా అటవీశాఖ అధికారికి వినతిపత్రం అందించి పోడు రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ..బందెగిరి నగర్'తోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏజెన్సీ గ్రామాల పరిధిలో ఏళ్లుగా భూమిని నమ్ముకుని బతుకుతున్న పేదల సాగు భూముల్లో కందకాలు తవ్వుతూ, మొక్కలు నాటుతూ వారి ఉపాధిని దెబ్బతీయడం అన్యాయమని అన్నారు. అనాదిగా పేదల సాగులో ఉన్న పోడు భూములకు తక్షణమే చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. జిల్లాలో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పోడు భూముల సర్వే పూర్తయినప్పటికీ, అర్హులైన పేదలకు హక్కు పత్రాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. సర్వే పూర్తయిన ప్రతి ఎకరాకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని, పేదలు స్వేచ్ఛగా సాగు చేసుకునే వెసులుబాటు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగా పోడు చేసే విధానాన్ని సిపిఐ మొదటి నుండి వ్యతిరేకిస్తోందని, అయితే తరతరాలుగా పోడుపైనే ఆధారపడి జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదలకు మాత్రం కచ్చితంగా హక్కు పత్రాలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అటవీ చట్టాల పేరుతో పేదల పొట్ట



కొట్టాలని చూస్తే సహించేది లేదని, సాగుదారులకు రక్షణ కల్పించే వరకు సిపిఐ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పోడురైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బండి నర్సింహా, తాటి ఎల్లయ్య, సున్నం పాపారావు, ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు, కుంజా వెంకటేష్, పడిగె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులపై కేంద్ర ప్రభుత్వ దాడి - 4 లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలి

**చట్టాల మార్పు కాదు - కార్మిక హక్కుల అపహరణ**

**ఏఐటీయూసీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్.బోస్**

**ఉప్పల్ జనసంఘర్షణ :**

కేంద్ర ప్రభుత్వం నేటి నుండి అమలు చేయబోతున్న నూతన 4 లేబర్ కోడ్లు కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి అని,ఇది చట్టాల మార్పు కాదు -- కార్మిక హక్కుల అపహరణ అని అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్. బోస్ అన్నారు . ఈ కోడ్లు కార్మికుల శ్రమను చౌకగా మార్చి, పెద్ద కార్పొరేట్ సంస్థల లాభాల కోసం రూపొందించిన దోపిడీ విధానాలు మాత్రమేనని, దీనిని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏఐటీయూసీ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని అంబేద్కర్ కూడలి వద్ద "బ్లాక్ డే"గా పాటిస్తూ,ప్లకార్డులు చేతబూని, నినదిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్. బోస్ మాట్లాడుతూ కార్మిక హక్కులను రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిస్తున్నామన్నారు.పని గంటల పెంపు - శ్రమ దోపిడీ పెరుగుదల కొత్త కోడ్ల ద్వారా పని




గంటలను పెంచే అవకాశం ఉందన్నారు. ఇది కార్మికుల ఆరోగ్యం, జీవన నాణ్యతను దెబ్బతీస్తుందని, ఉద్యోగ భద్రత లేకపోవడం 300 మందికి లోపల ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ప్రభుత్వం అనుమతి లేకుండా ఉద్యోగాలను తొలగించే స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా ఉద్యోగ భద్రత పూర్తిగా నశిస్తుందన్నారు.యూనియన్ హక్కులపై పరిమితులు పెట్టారని కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడం, సమ్మె చేయడం వంటి హక్కులను పరిమితం చేస్తూ కార్మికుల స్వరాన్ని అణచివేయడం జరుగుతోందన్నారు.కాంట్రాక్ట్ వ్యవస్థ పెరుగుదల పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలను ప్రోత్సహించడం ద్వారా కార్మికులను అస్థిర జీవితానికి నెట్టివేస్తున్నారన్నారు.వేతనాలు, సంక్షేమంపై దెబ్బ మినిమమ్ వేతనాలు,బోనస్, సామాజిక భద్రత వంటి అంశాలను బలహీనపరచి కార్మికుల హక్కులను తగ్గిస్తున్నారన్నారు,అందుకే ఏఐటీయూసీ కేంద్ర ప్రభుత్వంను వెంటనే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, గౌరవప్రద వేతనాలు కల్పించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను తగ్గించి పర్మినెంట్ ఉద్యోగాలను పెంచాలి యూనియన్ హక్కులను పూర్తిగా రక్షించాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ లేబర్ కోడ్లు కార్మికుల భవిష్యత్తుపై దాడి అని . ఇది కేవలం చట్టాల మార్పు కాదని కార్మిక హక్కుల అపహరణ. కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా, కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు.అనంతరం కుషాయిగూడ పోలీసులు ఏఐటీయూసీ నేతలను అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఎస్. శంకర్ రావు,ఏఐటీయూసీ నేతలు నారా నర్సింహా, జోషి, రాఘవేంద్ర రావు, నర్సింహా రావు,లక్ష్మీ నారాయణ, మోహన్, చలం, గండాలు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ అఫిలియేషన్ లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఆదిత్య డిగ్రీ కాలేజ్ పై చర్యలు తీసుకోవాలి

- ADAT-2026 మెరిట్ టెస్ట్ పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాల
- ఆదిత్య కళాశాలపై ఫిర్యాదు చేసిన ఏఐవైఎఫ్ నేతలు
- ఏఐవైఎఫ్ డిమాండ్

**ఉప్పల్ జనసంఘర్షణ :**

ఉస్మానియా విశ్వవిద్యాలయ అఫిలియేషన్ లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఆదిత్య డిగ్రీ కాలేజ్ పై చర్యలు తీసుకోవాలని, ADAT-2026 మెరిట్ టెస్ట్ పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జి. నరేష్ రెడ్డి కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలు మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని (నారాయణగూడ, దిల్సుఖ్ నగర్, ఆల్వాల్, హబ్సిగూడ, ఈసీఐఎల్, కూకట్పల్లి, సాగర్ రింగ్ రోడ్, మణికొండ, సైదాబాద్, మియాపూర్, సనత్ నగర్, లింగంపల్లి) ప్రాంతాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేశారని, సదరు కళాశాలాలకు యూనివర్సిటీ అఫిలియేషన్ స్పష్టత లేకుండానే డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించడం, అలాగే "మెరిట్ బేస్డ్ ఎంట్రన్స్ టెస్ట్ (ADAT-2026)" పేరుతో విద్యార్థులను మోసం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే కార్పొరేట్ దోపిడీ, ప్రస్తుత ప్రభుత్వాల విద్యా విధానాల కారణంగా, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి మోసాలకు పాల్పడుతున్నారన్నారు.ఆదిత్య డిగ్రీ కళాశాల అఫిలియేషన్ లేకుండా అడ్మిషన్లు, అనధికారిక ప్రవేశ పరీక్షలు, తప్పుడు ప్రచారాల ద్వారా విద్యార్థులను తప్పుదారి పట్టిస్తున్నాయ న్నారు. అఫిలియేషన్ ప్రక్రియను పక్కనపెట్టి ముందస్తుగానే అడ్మిషన్లు చేపట్టడం సరికాదన్నారు . ఇప్పటికే ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థుల అడ్మిషన్లు సైతం తీసుకుంటున్నరన్నారు . కాగా, ఈ కాలేజీ దోస్త్ పరిధిలో లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నట్లు వారు తెలిపారు. నిబంధనలను పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో కాకుండా ఇష్టారీతిన ఫీజులు పెంచుకుంటూ అడ్మిషన్లు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. యూనివర్సిటీ అఫిలియేషన్ నిబంధనలకు విరుద్ధమని, యూజీ కోర్సులలో అడ్మిషన్లు సాధారణంగా ఇంటర్మీడియట్ మెరిట్ ఆధారంగా ఇవ్వాలని,




కానీ ఆదిత్య డిగ్రీ కాలేజీ స్వతంత్రంగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించడం చట్టబద్ధం కాదన్నారు.ఓయూ అధికార యంత్రాంగం తక్షణమే ఆదిత్య డిగ్రీ కళాశాల అఫిలియేషన్ స్థితిని వెంటనే వెల్లడించాలని, "ADAT-2026" పేరుతో నిర్వహిస్తున్న ఎంట్రన్స్ టెస్ట్ను రద్దు చేయాలని, అక్రమ అడ్మిషన్లను నిలిపివేయాలని, కాలేజ్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co